ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 | కరీంనగర్ | ఆదివారం 6 జూలై 2025



## యూరియా సమస్య నివారించాలి

**ప్రజానావ, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండలంలో రైతులకు యూరియా సమస్య తొలగించి రైతులకు సత్వర న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కలిసి మండల తహసీల్దార్ కవిత రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాధవ్ పటేల్, మాజీ సర్పంచ్ పవార్ రవి నాయక్, జాదవ్ రమేష్, భీమ్రావ్ నాయక్, మాధవ్ తెలంగె, ప్రతాప్ రాథోడ్, ప్రకాష్, జాఫర్, అశోక్, పిరాజి పాల్గొన్నారు.

## ఉచిత యోగా శిక్షణ తరగతులు

**ప్రజానావ, తాండూర్:** తాండూరు మండలం విద్యా భారతి హై స్కూల్ ప్రాం గణంలో ఈ నెల 10, 11, 12న మూడు రోజులపాటు ఉచిత యోగా శిక్షణ తరగ తులను నిర్వహిస్తారని ప్రోగ్రాం నిర్వాహకులు బ్రహ్మానందం, వెంకటేశ్వర్లు, లక్ష్మీ పవన్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్ ఫుల్ సంస్థ సంయుక్తంగా 15 ఏండ్లు దాటిన వారందరికీ ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు సాయంత్రం 5.30గంటల నుంచి 6.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9052697372 నెంబర్‌కు సంప్రదించగలరని వారు కోరారు.

## మొహర్రం ఘనంగా వేడుకలు



**ప్రజానావ, జైనూర్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో పట్నాపూర్ కరీంగూడ గ్రామంలో హజ్రత్‌బారా ఇమామ్ దేవస్థానంలో మొహర్రంను శనివారం జరుపుకొన్నారు. యేటా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు సవారీలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. పూట వచ్చే భక్తులకు ఏ లోటు లేకుండా అన్ని సౌక ర్యాలు చేయడం జరిగిందని దేవస్థానం వ్యవస్థాపకుడు సాజిద్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## పందుల దాడిలో రైతుకు గాయాలు



**ప్రజానావ, నేరడిగొండ (ఇచ్చోడ):** పందుల దాడిలో ఇచ్చోడ మండలం దేవుల నాయక్ తండా గ్రామానికి చెందిన రైతు రాథోడ్ గంభీర్ సింగ్ తీవ్రంగా గాయ పడ్డాడు. శుక్రవారం తన వ్యవసాయ చేనులో పని చేస్తున్న గంభీర్ సింగ్‌పై అడవిలో నుండి వచ్చిన పందుల గుంపు వచ్చి ఒక్కసారిగా దాడి చేశాయి. ఆ సమయంలో తప్పించుకోవడానికి ఆయన పరుగెత్తుతున్న క్రమంలో బండపై జారి పడ్డాడు. దాంతో తలపై బలమైన గాయాలయ్యాయి. గమనించిన చుట్టు పక్కల రైతులు ఆయనను ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తలపై 13 కుట్లు పడినట్లు వైద్యులు తెలిపారు. గంభీర్ సింగ్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్టు సమాచారం.

## బెజ్జూర్ ఎస్సైగా సర్తాజ్ పాషా

**ప్రజానావ, బెజ్జూర్ :** బెజ్జూరు నూతన ఎస్సైగా సర్తాజ్ పాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2023 24 పోలీస్ రిక్రూట్‌మెంట్‌నూతన ఎస్సైగా మొదటి పోస్టింగ్ లో బెజ్జూర్‌కు వచ్చినట్టు ఎస్సై తెలిపారు. మండలంలోని ప్రజలు ప్రజా ప్రతినిధులు చట్టాన్ని గౌరవిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని గౌరవిస్తూ సహకరించిన వారిని గౌరవిస్తామని సంఘ వ్యతిరేక చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే లాండ్ ఆర్డర్ ను డిస్టర్బ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు.

## చతుర్వేద స్మార్త పరీక్షల పరిశీలన



**ప్రజానావ, వేములవాడ:** శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఓపెన్ స్లాబ్‌లో నిర్వహిస్తున్న చతుర్వేద స్మార్త పరీక్షలను శనివారం ఆలయ ఈఓ రాధాభాయి పరిశీలించారు. ఈ పరీక్షలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈవో వెంట ఆలయ అర్చకులతో పాటు పర్యవేక్షకుడు జీ. శ్రీనివాస్ శర్మ ఉన్నారు.

# బోనాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించండి

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్
- పజ్జన్నను మహంకాళి జాతరకు ఆహ్వానించిన ఆలయ అధికారులు

**ప్రజానావ, సికింద్రాబాద్ :** చారిత్రాత్మక ఉజ్జయిని మహంకాళి బోనాలు వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఏ ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ ప్రభుత్వానికి సూచించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయాన్ని సందర్శించి, బోనాలు వేడుకల్లో భాగస్వామ్యం కావాలని ఆలయం కార్యనిర్వహణాధికారి మహేందర్ రెడ్డి, ప్రధానార్చకుల నేతృత్వంలోని బృందం మోండా మార్కెట్ టకార బస్తీలోని పద్మారావు గౌడ్ నివాసాన్ని శనివారం సందర్శించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందించి, ఆలయం సాంప్రదాయం ప్రకారం పద్మారావు దంపతులను సత్కరించి ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# విధులపై బాధ్యతగా ఉండాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ప్రజానావ, మంచిర్యాల:** ప్రభుత్వ శాఖల అధికారులు ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల రిజిస్టర్లు, రికార్డులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికలు, ఆయా కార్యాలయాల పరిధిలో కొనసాగుతున్న పనుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు పనిచేస్తాయని, ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజలకు చేరువలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ఇబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





మొహర్రంను పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్‌లోని ఎర్రమంజిల్ కాలనీలో ఏర్పాటు చేసిన అలం (పీర్లు)ను శనివారం టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పీ. విజయా రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట ముస్లిం సోదరులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ప్రజానావ, ఖైరతాబాద్





## జర్నలిస్టు హఠాన్మరణం

**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల నియోజకవర్గ టీవీ9 రిపోర్టర్ గరదాస్ ప్రసాద్ (46) శనివారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో గుండెనొప్పి రావడంతో సన్నిహితులు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుండెనొప్పితో పాటు ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రసాద్ చెందిన విషయం తెలియడంతో సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులు నివాళులర్పించారు. రాజకీయ ప్రముఖులు, అధికారులు, జర్నలిస్టులు అంత్యక్రియల్లో పాల్గొని ప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రసాద్ మృతి విషయం తెలుసుకొని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్ రెడ్డిలు విచారం వ్యక్తం చేశారు. జర్నలిస్టు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథుని రథయాత్రను శనివారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు నెంబర్ 45 కాలనీలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రథ చక్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు భోజిరెడ్డి, సీతల అనిల్ కుమార్, కార్యక్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



